ఇక సమస్యలపై ఏకరువు..!

సత్వర సేవల కోసం జోనల్ పాలనకు అడుగులు

- ఒక్కో జోన్‌లో 10 నుంచి 15 డివిజన్లు
- భవనాల గుర్తింపు ప్రక్రియ పూర్తి
- మరికొన్ని పోస్టుల పెంపునకు కసరత్తు

ఖమ్మంమయూరిసెంటర్: నగర ప్రజలకు సత్వర సేవలు అందించి పరిపాలనను దగ్గర చేసేందుకు ఖమ్మంలో జోనల్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అందుకు నగరంలోని నలుదిక్కుల నాలుగు జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు. కాగా, ఇప్పటికే కార్యాలయాల కోసం భవనాలను ఎంపిక చేసి ఆయా కార్యాలయాల పరిధిలో ఏఏ డివిజన్లు ఉంటాయనేది అధికారులు జాబితా తయారు చేశారు. నాలుగు జోనల్ కార్యాలయాలతో పాటు కేంద్ర కార్యాలయంగా ఉంటే కేఎంసీ కార్యాలయానికి డివిజన్లను కేటాయించారు. జోనల్ విధానం ప్రారంభమైన తర్వాత ఆయా డివిజన్ల ప్రజలు తమ పరిధిలోని జోనల్ కార్యాలయాలకు వెళ్లి తమ సమస్యలను ఏకరవు పెట్టుకోవడంతో పాటు పౌర సేవలు అక్కడ నుండే పొందాల్సి ఉంది.

మరింత విస్తరించేలా..

నగరంలో జోనల్ కార్యాలయాలు ప్రారంభించాక గ్రేటర్ హైదరాబాద్ తరహాలో పాలనను అందించేందుకు ఒక్కో జోన్‌కు ఒక్కో డిప్యూటీ కమిషనర్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందుకోసం డిప్యూటీ కమిషనర్ పోస్టులను కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తే బాగుంటుందని భావిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి ఉంటే అక్కడ నుండే పూర్తిస్థాయిలో పరిపాలన జరుగుతుందని, పారిశుద్ధ్యం, పౌర సేవలు మరింత మెరుగుపడతాయని భావిస్తున్నారు.

☛ ఈస్ట్‌జోన్..

ఈ జోన్ పరిధిలో 11వ, 12వ, 13వ, 14వ, 15వ, 16వ, 19వ, 20వ, 21వ, 22వ, 41వ డివిజన్లు ఉండనున్నాయి. ఈ జోన్‌కు సంబంధించిన కార్యాలయాన్ని ఎస్‌బీఐటీ కళాశాల సమీపంలోని పబ్లిక్ హెల్త్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు.


ఈస్ట్‌జోన్ కార్యాలయం

☛ నార్త్‌జోన్..

నార్త్ జోన్‌లో 1 నుంచి 10 డివిజన్లు ఉండనున్నాయి. ఈ జోన్ కార్యాలయం ఖైకొండాయిగూడెంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయం భవనంను అధికారులు పరిశీలించారు. ఇక్కడ నుంచి నార్త్‌జోన్ పాలన సాగించాలని అనుకుంటున్నారు.


నార్త్‌జోన్ కార్యాలయం

☛ వెస్ట్ జోన్..

త్రీటౌన్ ప్రాంతానికి చెందిన డివిజన్లు ఈ జోన్‌లోకి రానున్నాయి. అయితే త్రీటౌన్ ప్రాంతంలో సరైన భవనం దొరికే వరకూ 25వ డివిజన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో వెస్ట్ జోన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ జోన్ పరిధిలో 17వ, 27వ, 28వ, 29వ, 30వ, 31వ, 32వ, 33వ, 34వ, 35వ, 36వ, 46వ, 47వ, 48వ, 59వ, 60వ డివిజన్లు ఉండనున్నాయి.


వెస్ట్ జోన్ కార్యాలయం



సెంట్రల్ కార్యాలయంగా కేఎంసీ కార్యాలయం

☛ సౌత్ జోన్..

సౌత్ జోన్ కార్యాలయాన్ని పాత మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ జోన్ పరిధిలో 18వ, 23వ, 24వ, 25వ, 26వ, 37వ, 38వ, 39వ, 40వ, 42వ డివిజన్లు ఉండనున్నాయి.


సౌత్‌జోన్‌గా పాత మున్సిపల్ కార్యాలయం

☛ సెంట్రల్ జోన్..

సెంట్రల్ జోన్ కార్యాలయంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఉండనుంది. ఈ కార్యాలయం పరిధిలో 43వ, 44వ, 45వ, 49వ, 50వ, 51వ, 52వ, 53వ, 54వ, 55వ, 56వ, 57వ, 58వ డివిజన్లు ఉంటాయి. ఇక్కడ నుంచి ఆయా డివిజన్లతో పాటు ఇతర జోనల్ కార్యాలయాలను పర్యవేక్షించనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజలకు శ్రీరామరక్ష

కామేపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తూ ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పాతలింగాలలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, స్థానిక పాఠశాలలో రూ.13 లక్షలతో నిర్మించిన సైన్స్ ల్యాబ్ భవనాన్ని, రామకృష్ణాపురంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, ఈజీఎస్ కార్యాలయం ఎదుట రూ.3 లక్షలతో నిర్మించనున్న టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులను తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నియోజకవర్గంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ చేరేలా శ్రమిస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. కాగా, సీతారామ ప్రాజెక్టు కాల్వ భూనిర్వాసితులకు నష్టపరిహారం అందించి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని,లేకుంటే కాల్వ నిర్మాణానికి రైతుల నుంచి సేకరించి భూమిని తిరిగి రైతులకు అప్పగించాలంటూ భూనిర్వాసితులు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందించారు. తొలుత ఊట్కూర్ గ్రామంలో గ్రామ దేవతల పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, మద్దినేని రమేశ్‌బాబు, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, దమ్మాలపాటి సత్యనారాయణ, ధరావత్ అనురాధ, తోటకూరి శివయ్య, ఏపూరి మహేందర్‌కుమార్, మాలోత్ సరిరాంనాయక్, అమిరినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పాతలింగాలలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

‘గోపా’ నూతన కమిటీ ఎన్నిక


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: గౌడ్ అఫీషియల్స్, ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) జిల్లా నూతన కమిటీని ఖమ్మం ఐఎంఏ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మాజీ జిల్లా అధ్యక్షుడు గుడిద శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బోల్లికొండ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బోలగాని శ్రీనివాసరావు, కోశాధికారిగా గండు యాదగిరి, ఎన్నికల సమన్వయకర్తగా బిచ్చల తిరుమలరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గోపా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి సామన్న మాట్లాడుతూ.. గోపా సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జీవీ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ముద్దగొని రామ్మోహన్, చెక్కిళ్ల మధుసూదన్‌లతో పాటు వెంకన్న, నెహ్రూ, మల్లయ్య, కృష్ణారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీకేఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) జిల్లా నూతన కమిటీని ఆదివారం నగరంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న శ్రీ సీతారామ కల్యాణ మండపంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పగడవరపు శ్రీనివాసరావు, కార్యదర్శిగా తాళ్లూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా వాణిపతి, కోశాధికారిగా నరేష్, సహకార కార్యదర్శిగా రాంబాబు, మహిళా కార్యదర్శిగా శ్రీదేవి, కార్యవర్గ సభ్యుడిగా నారాయణరావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో బీకేఎస్ దక్షిణ క్షేత్ర(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక) కార్యదర్శి దేనూరు రాము, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

శివాలయంలో దర్శన వేళలు

కూసుమంచి: కూసుమంచిలోని శివాలయం (గణపేశ్వరాలయం)లో భక్తులు ఆలయాన్ని దర్శించుకునే వేళలను మార్చినట్లు ఆదివారం ఈఓ శ్రీకాంత్ తెలిపారు. భక్తులు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఆలయాన్ని సందర్శించవచ్చని, పర్వదినాలు, ఉత్సవాల సమయాల్లో ఈ సమయాలు వర్తించవన్నారు.

నియామకం

నేలకొండపల్లి: వాసవీ క్లబ్ ఉమ్మడి జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్‌గా నేలకొండపల్లికి చెందిన రేగూరి హనుమంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకోబడ్డారు. సేవా కార్యక్రమాలను గ్రామాల్లోనూ అందించేలా కృషి చేస్తానని హనుమంతరావు తెలిపారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టు

తిరుమలాయపాలెం/రఘునాథపాలెం: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేడు(సోమవారం) తలపెట్టిన చలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న తిరుమలాయపాలెం, రఘునాథపాలెం మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలను ఆదివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తిరుమలాయపాలెంలో ముగ్గురు, రఘునాథపాలెం మండలంలో ఆరుగురిని బైండోవర్ చేసి వ్యక్తి గత పూచీకత్తుపై విడుదల చేశారు.

నేడు ప్రజావాణి రద్దు

ఖమ్మంమయూరిసెంటర్: నేడు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం సోమవారం రద్దు చేస్తున్నట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్ను వసూలు, ఎల్ఆర్ఎల్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన నేపథ్యాన ప్రజావాణి రద్దు చేసినట్లు తెలిపారు.

26న వాటర్ షెడ్ యాత్ర

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 26న ఏన్కూరు మండలంలో వాటర్ షెడ్ యాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.సన్యాసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన 2.0లో భాగంగా 26న ఉదయం 9.30 గంటలకు రాయమాధారం, మధ్యాహ్నం 1.30 గంటలకు సూర్యతండా గ్రామాల్లో ఈ యాత్ర ఉంటుందన్నారు. ఇందులో భాగంగా వాటర్ షెడ్ నిర్మాణ భూమి పూజ, మొక్కల పెంపకం, శ్రమదానం, లోకార్పణం వంటి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

వీరనారీమణుల వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: రఘునాథపాలెం మండలం పరిధిలోని పువ్వాడ ఉదయనగర్‌కు సంబంధించిన పలు సమస్యలపై ఆదివారం మంత్రి తుమ్మల తనయుడు, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్‌కు వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి మాట్లాడుతూ.. పువ్వాడ ఉదయనగర్ మాజీ సర్పంచ్ కాంపాటి లలిత, బీఆర్ఎస్ నాయకుడు, ఆమె భర్త రవిలు ఇళ్ల స్థలాలను అమ్ముకోవడంతో పాటు అసైన్డ్ భూములనూ ఆక్రమించుకొని వెంచర్లు చేశారని, పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని దీనిపై సమగ్ర విచారణ చేయించాలని కోరారు. అలాగే మాజీ సర్పంచ్ లలిత సోదరుడు నరసింహారావు ఓ వివాహితను శారీరకంగా, ఆర్థికంగా వాడుకోగా ఆమె పోలీసులకు చేసిన ఫిర్యాదును వాపసు తీసుకోవాలని బెదిరిస్తున్నారని, బాధితురాలికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమితి సభ్యులు విజయ, జ్యోతి, చందు, ప్రమీల, లలిత పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పువ్వాళ్ల, తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మంవన్‌టౌన్: సినీ నటుడు రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో భీమా జ్యూవెలర్స్‌కు చెందిన 15 మంది సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ భూక్య సురేందర్, డిప్యూటీ మేనేజర్ అలీమ్, లింగస్వామి, మార్కెటింగ్ కోఆర్డినేటర్ ఆడెపు చంద్ర శేఖర్ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన మరో రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకుడు తుమ్మల యుగంధర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు ప్రారంభించారు.

ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నెల్లూరి కోటేశ్వరరావు ఎన్నికైన సందర్భంగా ఆదివారం రాత్రి నగరంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌కు బీజేపీ మార్గదర్శకమని, పార్టీ బలోపేతం కోసం అందరూ సహకరించాలని కోరారు. ప్రగతి స్కూల్, కళాశాల వైరాకు చెందిన దామ వెంకటేశ్వరరావు, జాలాది భద్రయ్య, మిత్రులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పేదలకు జాతీయ ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అర్హులందరికీ అమలు చేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణీకరణ వేగవంతమైన తర్వాత పట్టణ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ భరోసా అమలు చేయాలన్నారు. తొలుత సీపీఐ పతాకాన్ని మేకల వీరమ్మ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సీపీఐ నగర కార్యదర్శి జానిమియాలతో పాటు మేకల రవికుమార్, జ్వాలా నర్సింహారావు, బోడ రమేష్, మహ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, తాటి నిర్మల, గాదె లక్ష్మీనారాయణ, బోడ వీరన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాగం హేమంతరావు

అన్నదానం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పాకబండబజార్‌లో మోతుకూరి రామకృష్ణ జ్ఞాపకార్థం రామకృష్ణ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మోతుకూరి చంద్రకళ ఆధ్వర్యాన ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నబత్తుల రేణుక పురుషోత్తం, పవన్, వాసు, ప్రణయ్, ఉపేందర్, చిట్టిబాబు, శ్రీధర్, శ్రీను, అన్నపూర్ణ, ఉష, మహేష్, శ్రీకాంత్, హరీష్, రాజేష్, శివ గణేష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

● మాన్‌ఫోర్ట్ స్కూల్ ఆవరణలో మంటలు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో గల మాన్‌ఫోర్ట్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం మంటలు వ్యాపించాయి. స్కూల్ ఆవరణలో ఎండిపోయిన మొక్కలు, చెట్ల కొమ్మలను పడేయడంతో మంటలు అలముకుని మంటలు, దట్టమైన పొగ రావడంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు, కేఎంసీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పారు. చెట్ల కొమ్మలు, చెత్తను పాఠశాల ఆవరణలో వేసి నిర్లక్ష్యంగా ఉన్న పాఠశాల యాజమాన్యానికి కేఎంసీ అధికారులు రూ.15 వేల జరిమానా విధించారు. వేసవి కాలంలో చెట్ల కొమ్మలు, ఎండిన ఆకులు నివాసాల మధ్య కుప్పలుగా పోయొద్దని, వాటిని బయటకు తరలించాలని కేఎంసీ అధికారులు సూచించారు.

● జవాన్, డ్రైవర్‌కు వేతనాల్లో కోత..

విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడమే కాక, కేఎంసీ పనులు పక్కన పెట్టి ప్రైవేట్ వ్యక్తుల పనుల్లో నిమగ్నమైన జవాన్, జేసీబీ డ్రైవర్‌పై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 29వ డివిజన్ జవాన్ వెంకటేశ్వర్లు, జేసీబీ డ్రైవర్ బాబు డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు చేయించకుండా అక్కడే ప్రైవేట్ వ్యక్తి ఖాళీ స్థలంలో యజమాని వ్యక్తిగత పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న శానిటరీ సూపర్‌వైజర్ వారికి ఐదు రోజుల వేతనం కోత విధించారు. సిబ్బంది కేఎంసీకి సంబంధించిన పనులు మాత్రమే చేయాలని, ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన పనులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోస్టర్లు ఆవిష్కరణ

● మహాసభ పోస్టర్లు

నేలకొండపల్లి: ఈ నెల 25న మహబూబ్‌నగర్‌లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు ఎస్.కె.యాకోబ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఈమేరకు సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కార్మికుల సంక్షేమం కోసం కార్మిక ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పి.పిచ్చయ్య, పెద్దపాక వెంకన్న, నెవిలి శ్రీనివాసరావు, రాజపుత్ర జనార్దన్‌సింగ్, వీరబాబు, శ్రీను, వెంకటేష్, అక్బర్, రవి పాల్గొన్నారు.

● బ్రహ్మోత్సవాల పోస్టర్లు

ఖమ్మంఅర్బన్: ఈనెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు జరిగే నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలోని స్వయంభూ శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు బొల్లి కొమరయ్య, పురం తిరుపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్ నాయక్, ప్రధాన అర్చకులు నరిగిరినాథుని రామాచార్యులు, గౌరవ అధ్యక్షుడు మేకల వీరన్న, అల్లిక అంజయ్య, బెల్లి కొండలరావు, వెంకటేశ్వర్లు, సూర్యం, సత్యం, రామారావు, కిషన్ నాయక్, రాజు, వీరయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు ఖమ్మం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మంజూరైన రూ.21.75లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం మేయర్ నీరజ, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, ఇతర కార్పొరేటర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మల్లిడి వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, కొప్పెర ఉపేందర్, మిక్కిలినేని నరేందర్, ఎండీ ఖాదర్‌బాబా, ఆళ్ల అంజిరెడ్డి, బాణాల లక్ష్మణ్, తుపాకుల శ్రీను, నరాల నరేష్, కమతం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పువ్వాడ పర్యటన

రఘునాథపాలెం: నగరంలోని పలు డివిజన్లు, రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించడంతో పాటు శుభకార్యాలకు హాజరయ్యారు. ఆయన వెంట నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రరెడ్డి, కార్పొరేటర్ కోటేశ్వరరావులతో పాటు వలరాజు, వీరునాయక్, రవి, హరిప్రసాద్, రామారావు, ప్రదీప్, పాల్గొన్నారు.

● ఇఫ్తార్ విందులో..


ఇఫ్తార్ విందులో ప్రార్థన చేస్తున్న పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కాల్వొడ్డు మోతీమసీద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రార్థన చేశాక మాట్లాడి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణంతో పాటు తాజుద్దీన్, మాటేటి నాగేశ్వరరావు, తోట వీరభద్రం, బోజెండ్ల రామ్మోహన్, ముజాహిద్, తౌసిఫ్, మాటేటి కిరణ్, అంజాద్ పాల్గొన్నారు.

● పోస్టర్లు ఆవిష్కరణ..

నగరంలోని రాపర్తినగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ పోస్టర్లను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

రిలే నిరాహార దీక్షలు

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో ఇంటి స్థలాల కోసం పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపించాలని కోరుతూ ఆదివారం సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ.. 130 మందికి ఇళ్ల స్థలాలు, 18 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. మండల కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నేడు(సోమవారం) మండల కేంద్రంలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శాఖ కార్యదర్శి వెంకటేష్, నాయకులు మహేందర్, నాగేశ్వరావు, శ్రీనివాస్, రాము, ముత్తయ్య, వెంకన్న, వెంకన్న, నాగేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

తడిసిన మక్కలను గిట్టుబాటు ధరకు కొనాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అకాల వర్షంతో తడిసిపోయిన మొక్కజొన్నలను రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనాలని తెలంగాణ రాష్ట్ర సంఘటన కార్యదర్శి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చిరైతులను ఆదుకోవాలని, సన్నవడ్లకు రూ.500 బోనస్ అందరికీ రాలేదన్నారు. అనంతనం దక్షిణ క్షేత్ర సంఘటన కార్యదర్శి దోనూరు రాము మాట్లాడుతూ.. రైతు భరోసా అర్హులైన రైతులందరికీ విడుదల చేయాలని, రూ.5 లక్షల రైతు బీమా తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడిగా పగడవరపు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరు శ్రీనివాసరావు, ఖమ్మం జోన్ కార్యదర్శిగా మందనపు రామారావు, జిల్లా ఉపాధ్యక్షులుగా వాణిపతి, కోశాధికారిగా నరేష్, సహకార కార్యదర్శిగా రాంబాబు, మహిళా కార్యదర్శిగా శ్రీదేవి, నారాయణరావులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

సన్మానం..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌టీయూ కార్యాలయంలో నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల పదవీ విరమణ పొందిన కేఎస్ రామారావును ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. విశ్రాంత ప్రిన్సిపాల్ రామారావు విద్యావ్యవస్థకు చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండు యాదగిరి, షేక్ మన్సూర్, నాయకులు కరీముల్లా, పాశం శ్రీనివాసరావు, పోతగాని వెంకన్న, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.100కోట్లు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర బడ్జెట్‌లో విశ్వబ్రాహ్మణ ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయించాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని దానవాయిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణలకు సీట్లు కేటాయించాలని, నగరంలో సంఘభవనం కోసం 2 వేల గజాలు స్థలం కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా 59వ డివిజన్ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటి వెంకటాచారి, ఉపాధ్యక్షుడిగా అనుముల సోమేశ్వరచారి, ప్రధాన కార్యదర్శిగా మమ్మూరి రాజయ్యాచారి, కోశాధికారిగా వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా నాగార్జున తదితరులను ఎనుకున్నారు. అనంతరం నూతన కమిటీచే ప్రమాణస్వీకారం చేయించారు. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండోటి సోమేశ్వరాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు విజగిరి సదానందాచారి, కోశాధికారి వెగ్గళం వెంకటేశ్వర్లు, వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి పొంగులేటి పరామర్శ

కూసుమంచి: పాలేరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎడవెల్లి రామిరెడ్డి తల్లి మాణిక్యమ్మ మృతిచెందగా ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. మంత్రి వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల పోరాటం స్ఫూర్తిదాయకం

దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల పోరాటం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి వేడుకలను డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ–పీవైఎల్, సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించి సేవలను కొనియాడారు. అమరవీరులకు జోహార్లు అంటూ పలుచోట్ల కాగడాల ప్రదర్శన నిర్వహించారు. భగత్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంరూరల్: కామంచికల్‌లో నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు


సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన